క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా ఉంటాం



రామేశ్వరమ్మను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి: పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరి కుటుంబానికి ఎళ్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి భరోసా కల్పించారు. మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన కాటుమాన్ రామేశ్వరమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుకున్న ఎమ్మెల్యే సోమవారం ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆరోగ్య విషయం తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. నాయకులు సుభాష్, మంగరాజు తదితరులు వెంట ఉన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులు పరిశీలిస్తున్న అధికారులు

మద్దికెర: మద్దికెర– బొజ్జనాయునిపేట వరకు రూ.2.75 కోట్లతో నిర్మిస్తున్న తారు రోడ్డు పనులను పంచాయతీ రాజ్ శాఖ ఏఈ జాకీర్ హుస్సేన్, ఐడీసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోడ్డు పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

గురజాలలో కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు

నందవరం: మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని మండలంలోని గురజాలలో ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. సోమవారం పోటీలు ప్రారంభించగా 28 జట్లు పోటీలో పాల్గొన్నాయి. మొదటి రోజు 10 జట్లు విజయం సాధించాయి. మంగళవారంతో పోటీలు ముగియనున్నాయి. గ్రామ సర్పంచ్ వీరస్వామి, ఆలయ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పోటీలు జరుపుతున్నారు.

అదనపు ఖాజీ నియామకం



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 2 నుంచి 12వ వార్డులకు ప్రభుత్వ ఖాజీగా ఎం.ఖైరుల్లా బేగ్‌ను నియమిస్తూ రాష్ట్ర మైనారిటీ వెల్ఫేర్ శాఖ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఖాజీగా నియామకమైన ఆయన ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని సోమవారం ఆయన నివాసంలో కలిసి ఖాజీగా నియమితులయ్యేందుకు సహకరించడంపై సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ తదితరులు ఉన్నారు.

యూహెచ్‌సీ ఏర్పాటు చేయాలి



మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎస్సీ కాలనీలో అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలని కేవీపీఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆంథోని, గుంటప్ప కోరారు. సోమవారం ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఎస్సీ కాలనీలో హెల్త్ సెంటర్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అలాగే డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. ఆ సంఘ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

హొళగుంద: మండలంలో సోమవారం అమావాస్య సందర్భంగా భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు, మహామంగళారతి, అర్చనలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆంధ్రాతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అదేవిధంగా హొళగుంద సిద్ధేశ్వర స్వామి, వీరభద్రేశ్వర స్వామి, సాయిబాబా మందిరం, గజ్జహళ్లి పోతులింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ఎల్లార్తి షేక్షావలి, షాషావలి, హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాల్లో భక్తులు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించారు.

పేదలకు గృహయోగం

- సొంతింటి కల సాకారం చేసేలా ప్రభుత్వం కృషి
- జగనన్న కాలనీల్లో శరవేగంగా నిర్మాణాలు
- కొత్తగా వెలుస్తున్న కాలనీలు
- మౌలిక వసతుల కల్పన



కోటేకల్ జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

ఎమ్మిగనూరు: ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఆయా గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల లేని నిరుపేదలను గుర్తించి జగనన్న కాలనీల్లో స్థలాలను మంజూరు చేసింది. ఇందుకోసం కోట్లాది రూపాయలు వెచ్చించింది. స్థలాలు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలో టిడ్కో ఇళ్ల సముదాయాల పక్కన 1,711 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ప్రభుత్వం నిర్మాణాలను చేపట్టింది. ఎమ్మిగనూరు మండలంలో 16 గ్రామ పంచాయతీల్లో ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. కోర్టు కేసుల కారణంగా బనవాసి, గోనెగండ్ల, సోగనూరు గ్రామ పంచాయతీల్లో పనులు నిలిచిపోయాయి. గోనెగండ్ల మండలంలో 20 పంచాయతీల్లో, నందవరం మండలంలో 14 గ్రామ పంచాయతీల్లో ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోనూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారుల్లో విశేష స్పందన ఉంది.

ప్రభుత్వ తోడ్పాటు

పేదలకోసం మంజూరు చేసిన జగనన్న లే అవుట్ కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపడితే ప్రభుత్వం తోడ్పాటునందిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు కేటాయిస్తున్నాయి. పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 వేలు చొప్పున బ్యాంకు రుణాలు అందించేలా చర్యలు చేపట్టింది. లబ్ధిదారులు తమ అభిరుచికి అనుగుణంగా మరింత సొమ్ము జమ చేసుకొని అందమైన ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 2,737 ఇళ్లు, ఆలూరు నియోజకవర్గంలో 2,757, పత్తికొండ నియోజకవర్గంలో 3,939 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న మిగతా ఇళ్లను ఆరు నెలల్లో పూర్తిచేయాలని అధికార యంత్రాంగం లక్ష్యాన్ని నిర్దేశించింది.

మౌలిక వసతుల కల్పన

జగనన్న కాలనీల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. లే అవుట్ కాలనీల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, నీటివసతి కల్పన, విద్యుత్ సౌకర్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి పనులను చేపడుతోంది. అదేవిధంగా లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్, స్టీల్ ఇతర సామగ్రిని ప్రభుత్వమే సరఫరా చేస్తూ సౌకర్యాలను కల్పిస్తోంది. దాదాపు 40 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. కొందరు ఇప్పటికే గృహప్రవేశాలు చేశారు. మరికొందరు ఉగాది రోజున గృహ ప్రవేశాలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆరు నెలల వ్యవధిలో సాధ్యమైన మేరకు ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం హౌసింగ్ అధికారులకు లక్ష్యాలను నిర్దేశించింది.



తుగ్గలిలో ఇళ్ల నిర్మాణం జరుగుతున్న దృశ్యం

జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం ఇలా..

నియోజక వర్గం	మంజూరైన ఇళ్లు	వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నవి	పూర్తయిన ఇళ్లు	చెల్లించిన బిల్లులు (రూ.కోట్లలో)
ఎమ్మిగనూరు	7,382	4,645	2,737	39.13
ఆలూరు	6,427	3,670	2,757	29.87
పత్తికొండ	7,933	3,994	3,939	45.03

జగనన్న ఇచ్చిన వరం



మాలాంటి నిరుపేదలకు ముఖ్యమంత్రి జగనన్న ఇచ్చిన వరం సొంతిల్లు. ఎన్నో ఏళ్లుగా నివాసం ఉండటానికి దిక్కులేని మాకు బళ్లారి–రాయచూరు హైవే రోడ్డు పక్కనే జగనన్న కాలనీ ఏర్పాటు చేసి ఇళ్లు నిర్మించడం మా అదృష్టం. జగనన్న చలువతో సొంతింటి కల తీరింది. గృహప్రవేశం చేసి ఆనందంగా జీవిస్తున్నాం. – ఏ జయమ్మ, బోదబండ, ఎమ్మిగనూరు మండలం

మహిళలకు ఇచ్చిన గౌరవం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మహిళలపై ప్రత్యేక అభిమానం. ప్రతి పథకాన్ని మహిళల పేరుతో అమలుచేస్తూ సమాజంలో, కుటుంబంలో వారి గౌరవాన్ని పెంచారు. జగనన్న ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకున్నాం. సొంతింట్లో నివాసం మా కుటుంబానికి ఎంతో ఆనందాన్నిచ్చింది. – మంజులమ్మ, గోనెగండ్ల

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచుతాం

జగనన్న కాలనీ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి. దాదాపు 45 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తికావొచ్చాయి. మిగిలిన ఇళ్ల నిర్మాణం కూడా ఆరునెలల వ్యవధిలో పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. కాలనీల్లో మౌలిక వసతులు ఏర్పాటయ్యాయి. లబ్ధిదారుల్లో సొంతిల్లు నిర్మించుకోవాలనే ఉత్సాహం పెరుగుతోంది. – ప్రసాద్, హౌసింగ్ డీఈ, ఎమ్మిగనూరు

వైఎస్ జగన్‌తోనే సామాజిక న్యాయం

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయం పాటించడం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే సాధ్యమైందని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం తన నివాసంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ తరఫున 18 మంది ఎమ్మెల్సీ అభ్యర్థులను ఎంపిక చేశారని, వీరిలో 11 మంది బీసీలు, ఇద్దరు ఎస్సీలు, ఒక ఎస్టీ, నలుగురు ఓసీ సామాజికవర్గానికి చెందిన వారుండడం హర్షించదగ్గ విషయమన్నారు. రాజకీయంగా అన్ని కులాలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. సామాజిక న్యాయం పాటించడం ద్వారా అన్ని వర్గాలకు న్యాయం చేకూరినట్లు అయిందన్నారు. ఆదోనికి చెందిన వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్‌కు ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వడంతో జిల్లా పశ్చిమ ప్రాంతంలోని వాల్మీకులకు సమన్యాయం చేసినట్లు అయ్యిందని పేర్కొన్నారు.

బీసీలకు న్యాయం

రాష్ట్రంలో బీసీ అభ్యర్థులకు 11 ఎమ్మెల్సీ స్థానాల్లో అవకాశం కల్పించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం చేశారని వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీలకు న్యాయం చేస్తూ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అవకాశం కల్పించడం హర్షించదగ్గ విషయమన్నారు. వాల్మీకి వర్గానికి చెందిన డాక్టర్ మధుసూదన్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

23 నుంచి కబడ్డీ పోటీలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట గ్రామంలో శ్రీ మహాలింగేశ్వర స్వామి జాతర పురస్కరించుకొని ఈ నెల 23 నుంచి 25 వరకు ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగనున్నట్లు చెప్పారు. పోటీలో పాల్గొనే జట్లు ఈ నెల 23వ తేదీలోపు రూ.600 ఎంట్రీ ఫీజు చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.25,016, రెండో బహుమతి రూ.5,016 అందచేయనున్నట్లు తెలిపపారు. వివరాలకు 81068 28297, 91777 89187 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి వద్దకే వైద్యం

ఆలూరు రూరల్: గ్రామీణ ప్రాంత రోగుల ఇబ్బందుల దృష్ట్యా ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా 104 వాహనాలతో ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేయడంతో పాటు మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి అన్నారు. సోమవారం మండలంలోని కాత్రికి గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేశారు. వృద్ధులకు షుగర్, బీపీ వంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మొలగవల్లి పీహెచ్‌సీ పరిధిలో ఉన్న అన్ని సచివాలయాల్లో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు అందుబాటులో ఉండి ప్రతి రోజు వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. ఆయుష్మాన్ సర్వే పూర్తయితే దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు దేశంలో ఏ ఆస్పత్రికైనా వెళ్లి ఆయుష్మాన్ కార్డు చూపితే వారికి అందుతున్న వైద్యం వివరాలు తెలుస్తాయన్నారు. దీంతో అక్కడి వైద్యులు ఆ రోగికి వైద్యం అందించడం సులువు అంతుందని చెప్పారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్త్ క్యాంపులో 67 మందికి వైద్య పరీక్షలు చేశారు.



మరకట్టులో రోగి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న డాక్టర్ మారుతి

నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు పలు హోటళ్లు, స్వీట్ షాపులపై ఎన్విరాల్‌మెంటల్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది దాడులు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని వ్యాపారులకు జరిమానా విధించారు. వారు మాట్లాడుతూ 120 మైక్రాన్ల కంటే తక్కువ నాణ్యత ఉన్న సింగిల్ యూజ్ కవర్లను ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులకు సూచించారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా జనపనార, గుడ్డ సంచులు, కాగితపు కవర్లు వాడాలని ఇందుకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టణంలోని ఓ స్వీట్‌స్టాల్‌లో స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లు

పౌష్టికాహారం సక్రమంగా అందించండి

ఎమ్మిగనూరురూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని సీడీపీఓ సఫర్నీ సాబేగం సూచించారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం అవరణలో ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే పౌష్టికాహారం, కోడిగుడ్లను పిల్లలు, బాలింతలు, గర్భవతులకు సక్రమంగా అందించాలన్నారు. కేంద్రాలకు పిల్లలను రప్పించడం మన బాధ్యత అని, పిల్లలు ఇష్టంతో వచ్చేలా చూడాలన్నారు. రిజిస్టర్ సక్రమంగా ఉండాలని, అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని, డ్రెస్ కోడ్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. పిల్లల ఎత్తు, బరువు వివరాలు ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఏసీడీపీఓ మద్దమ్మ, సూపర్‌వైజర్లు, బీపీఏ రాజు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వైభవంగా శాంతియాత్ర

హొళగుంద: కుల మత భేదాలు వీడి ప్రతిఒక్కరూ సోదర భావంతో మెలగాలని బ్రహ్మకుమారీలు భాగ్యమ్మ, లక్ష్మి అన్నారు. హొళగుందలో మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని సోమవారం ఓం శాంతి ప్రజాపితా బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శివ జయంతి శాంతి యాత్ర జరిగింది. బ్రహ్మకుమారీలు భక్తి సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా హొళగుందకు చెందిన పలువురు గ్రామపెద్దలను ఘనంగా సన్మానించారు. అంతకుముందు వారి చేత ఓం శాంతి జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేయించారు. అనంతరం గ్రామ పుర వీధులగుండా శాంతియాత్ర నిర్వహించారు. చిన్నారులు వివిధ మతస్తుల వేషధారణతో ఆకట్టుకున్నారు.



హొళగుందలో శాంతి ర్యాలీని నిర్వహిస్తున్న దృశ్యం



ముగిసిన మస్తాన్ వలి ఉరుసు

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామంలో వెలసిన దివానే మస్తాన్ వలి స్వామి 37వ ఉరుసు గ్రామ పెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ప్రతిమను గుర్రంపై గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు.

చివరి రోజైన సోమవారం గ్రామంలోని మహిళలు, ప్రజలు పెద్దెత్తున హాజరై స్వామివారికి చక్కెర చదివింపులు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

నేటి నుంచి దేవర

తుగ్గలి: మండల పరిధిలోని మారెల్ల, పి.కొత్తూరులో మంగళవారం నుంచి పెద్దమ్మ, మారెమ్మవ్వ, సుంకులమ్మ, సుగాలి నాగమ్మ అమ్మవార్ల దేవర ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 21న గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు, 22న బోనాల సమర్పణ ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

ఈ-కేవైసీ పూర్తి చేయాలి

కృష్ణగిరి: రబీలో పంటలు సాగుచేసిన రైతులను సంప్రదించి ఈ-కేవైసీ వంద శాతం పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఆయన సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఎంపీఈఓలతో సమావేశం నిర్వహించారు. రబీ సీజన్‌లో ఇప్పటివరకు 1,904 మంది రైతులు 5,878 ఎకరాల్లో సాగుచేసిన వివిధ రకాల పంటలను ఈ-క్రాప్ కింద నమోదు చేసినట్లు వివరించారు. నమోదు చేసిన ప్రతి రైతుకు సంబంధించి ఈ-కేవైసీ పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు 1,398 మంది మాత్రమే ఈకేవైసీ పూర్తి చేసినట్లు చెప్పారు. మిగతా రైతులకు సంబంధించి త్వరలోనే ఈ-కేవైసీ పూర్తి చేయాలన్నారు. అలాగే రానున్న ఖరీఫ్‌కు సంబంధించి మట్టి నమూనాలను సేకరించాలని సిబ్బందికి సూచించారు.

బాలుడిని మింగేసిన బావి

కృష్ణగిరి: బుడి బుడినడకలతో ఇల్లంతా తిరిగే బాలుడిని చూసి విధి కన్నెర్ర చేసింది. రాకాసి బావి రూపంలో మింగేసి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చింది. ఈ ఘటన మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఉప్పరి శేషు, కొమలి దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్నవాడైన సూరి (5) స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి వెళుతున్నాడు. సోమవారం మధ్యాహ్న భోజనం తర్వాత కేంద్రం నుంచి పిల్లలందరినీ ఇంటికి పంపారు. సూరి మాత్రం ఇంటికి చేరుకోలేదు. సాయంత్రమైనా పిల్లవాడు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు గాలింపు చేపట్టారు. దండోరా వేయించారు. పోలీసులను సంప్రదించగా ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి సిబ్బందితో గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. సీసీ పుటేజీ దృశ్యాలను పరిశీలించగా సూరి మరో పిల్లాడితో కలిసి లాలుస్వామి దర్గా వైపు వెళ్లినట్లు గుర్తించారు. కొద్దిసేపటికి ఆ పిల్లాడు కంగారుగా తిరిగివచ్చాడు. సూరి దర్గా సమీపంలోని బావిలో పడిఉండొచ్చనే అనుమానంతో ట్రాక్టర్ ఇంజిన్లతో నీటిని తోడించగా మృతదేహం కనిపించింది. బాలుడి మృతదేహాన్ని చూసి కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. అంగన్‌వాడీ టీచర్ నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు చనిపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు.



మృతి చెందిన సూరి

నేడు ఇమాంఖాశీం స్వామి ఉరుసు

కృష్ణగిరి: కోరిన కోర్కెలు తీర్చే కల్పతరువు, కొలిచే వారికి కొంగు బంగారమై ఆపదలో ఆదుకునే మహిమాన్వితుడు, పోతుగల్లు గ్రామంలో వెలసిన భక్తుల ఆరాధ్య దైవం ఇమాంఖాశీం స్వామి ఉరుసు గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా జరుపుకుంటున్నారు. ఉరుసు సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సోమవారం రాత్రి 11 గంటల నుంచి మంగళ వాయిద్యకారులు, డప్పు వాయిద్య కళాకారులతో అశ్వంపై గంధం ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామికి సమర్పిస్తారు. 21న మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఉరుసు నిర్వహించి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. 22న కిస్తీతో ఉరుసు ముగుస్తుంది. ఈ మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



పోతుగల్లు దర్గాలో ఇమాంఖాశీం స్వామి సమాధి

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

ఆస్పరి: వైఎస్సార్‌సీపీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డికి మద్దతుగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. రెవెన్యూ, ఎంపీడీఓ, జడ్పీహెచ్‌ఎస్‌కు వెళ్లి ఓటర్లకు కరపత్రాలు అందజేసి ఓటర్లను అభ్యర్థించారు. కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, సొసైటీ సీఈఓ ఆశోక్, వైఎస్సార్‌సీపీ నాయకులు తిమ్మప్ప, వీరభద్రి, రాజు, విజయ్ కుమార్, మంజునాథ్‌గౌడ్, ఆలీ పాల్గొన్నారు.



ఆస్పరిలో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

వెల్దుర్తి: చెర్లకొత్తూరు ఫక్కీరప్ప తాత తిరునాల సందర్భంగా సోమవారం న్యూకేటగిరీ వృషభాలకు నిర్వహించిన బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను దేవస్థానం పూజారి ఎల్లయ్య ప్రారంభించారు. ప్రథమ బహుమతి రూ.50 వేలను దాత పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అందించగా విజేతగా నిలిచిన నంద్యాల జిల్లా టి.హుసేనాపురం వృషభాలు దక్కించుకున్నాయి. ద్వితీయ స్థానంలో కర్నూలు కై రవాడి లక్ష్మన్న వృషభాలు, మూడు, నాలుగు స్థానాలను ఒకే దూరం లాగిన కర్నూలు కొత్తపల్లె దుబ్బన్న వృషభం, నంద్యాల ప్యాపిలి పీఆర్ పల్లె శివకోటి వృషభం సంయుక్తంగా, టి హుసేనాపురం రామసుబ్బారెడ్డి వృషభాలు నిలిచాయి. తర్వాతి నాలుగు స్థానాలలో కర్నూలు గూడూరు బోయ వెంకటేశ్వరరెడ్డి వృషభాలు, నంద్యాల డోన్ సీసం గుంతల మదన్‌మోహన్ రెడ్డి, భువనచంద్ర వృషభాలు, వెల్దుర్తి మండలం చెర్లకొత్తూరు కృష్ణార్జున, డోన్ ఆవులదొడ్డి నారాయణరెడ్డి వృషభాలు సంయుక్తంగా, కర్నూలు పెద్దపాడు భీముడు వృషభాలు నిలిచాయి. రూ.50 వేల నుంచి రూ.5 వేల వరకు 9 నగదు బహుమతులను విజేత వృషభాల యజమానులకు పూజారి ఎల్లయ్య, దాతలు అందించారు. నాయకులు గంగాధర్, రామచంద్రుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఎల్లకృష్ణ, వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బారెడ్డి, ఎల్లనాగి, రాజగోపాల్ పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న పూజారి ఎల్లయ్య

రోడ్డు నిబంధనలు పాటించాలి

గోనెగండ్ల: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ తిమ్మారెడ్డి సూచించారు. సోమవారం ఆయన తన సిబ్బందితో ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. లైసెన్స్, ఇన్సూరెన్స్, హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులకు, వాహన ధ్రువపత్రాలు లేని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా వాహన ధ్రువపత్రాలు, లైసెన్స్ వెంట ఉంచుకోవాలన్నారు. అలాగే మద్యం సేవించి వాహనం నడపడం, వేగంగా వెళ్లడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హితవు పలికారు. పెండింగ్‌లో ఉన్న జరిమానాలు చెల్లించాలని వాహనదారులను కోరారు.

రథోత్సవం ‘బ్రహ్మాం’డం



బ్రహ్మగుండంలో అశేష జనుల మధ్య రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం ఇన్‌సెట్ (గంగా, గౌరీ సమేత బ్రహ్మగుండేశ్వర స్వామి)

వెల్దుర్తి: హరహర మహాదేవ నామస్మరణ బ్రహ్మగుండం క్షేత్రంలో మార్మోగింది. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం గంగా,గౌరీ సమేత బ్రహ్మేశ్వర స్వామి రథోత్సవం బ్రహ్మాండంగా సాగింది. ఆలయ ఈఓ హనుమంతరావ్, చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో రమణీయంగా సాగిన రథోత్సవ కార్యక్రమాన్ని జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులు కనులారా తిలకించి పులకించారు. ముందుగా అర్చకులు శివ ఆధ్వర్యంలో నూతన వధూవరులైన దేవతామూర్తులను ఆలయ ప్రాంగణంలోనే సర్వాలంకారభూషితులు గావించి ఆయకట్టుదారులతో కలిసి మంగళవాయిద్యాల నడుమ రథశాలకు చేర్చారు. సుందరంగా అలంకరించిన రథంపై నూతన వధూవరులను ఆశీనులు గావించారు. అనంతరం కామేశ్వరీ దేవి ఆలయ అర్చకులు శ్రీధర్ శర్మ రథాంగపూజ, క్రతువులు నిర్వహించారు. ఆచారులు కొబ్బరి, గుమ్మడికాయలను సాత్విక బలిగా సమర్పించారు. హరహర మహాదేవ నామస్మరణ మధ్య భక్తులు గొలుసులను లాగి రథ చక్రాలను ముందుకు కదిలించారు. దాదాపు 200 మీటర్ల దూరం లాగి తిరిగి రథశాలకు చేర్చారు. అనంతరం ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్ద నుంచి ఆలయానికి చేర్చారు. రథయాత్ర ముందు నందికోలు సేవ భక్తులను అలరించింది. రథాలంకరణలో భారీ రుద్రాక్ష గజమాల అబ్బురపరిచింది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, మాజీ ఎంపీపీ దశరథ రామిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ దాదిపోగు సుంకన్న, పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు, శివారెడ్డి, దేవరాజ్, రఘురెడ్డి తదితరులు పాల్గొన్నారు. సీఐలు యుగంధర్, మురళి ఆధ్వర్యంలో ఎస్‌ఐలు చంద్రశేఖర్ రెడ్డి, నాగేంద్రప్రసాద్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు బందోబస్తు నిర్వహించారు.

నేడు వసంతోత్సవం, బండలాగుడు పోటీలు

మంగళవారం స్వామి, అమ్మవార్ల దేవతామూర్తులకు ఆలయ ప్రాకారం చుట్టూ వసంతోత్సవం నిర్వహించనున్నారు. అలాగే సీనియర్ కేటగిరీ వృషభాల బండలాగుడు పోటీలకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం దేవతామూర్తులకు పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించడంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

క్షేత్రానికి ఉచిత బస్సు సర్వీసులు

రథోత్సవం సందర్భంగా మండల కేంద్రం నుంచి క్షేత్రానికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, స్థానిక ఫర్టిలైజర్స్, కిరాణం అసోషియేషన్, స్థానిక పోలీసులు, విలేకరులు 4 ఉచిత ఆర్టీసీ బస్సులు, చెరుకులపాడు బత్తిన ఎల్లప్ప, మల్లయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు రాముడు, లోకేశ్ 2 బస్సులు ఏర్పాటు చేశారు. రామళ్లకోట నుంచి క్షేత్రానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసులు 12 ఆటోలు ఉచితంగా ఏర్పాటు చేశాడు. ఆర్యవైశ్య అన్న సత్రం, కోటయ్య దేవాలయం నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.